సాక్షి
రాజన్న సిరిసిల్ల


సోమవారం । 8 । మే । 2023



ఇక రెండో విడత గొర్రెలు..!

రెండో విడత గొర్రెల పంపిణీకీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

8లో



పేకాటలో 'పెద్దోళ్లు'..

ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు దారి తప్పుతున్నారు. వారికి వ్యాపారులూ జతకలుస్తున్నారు. పేకాట, పార్టీలు అంటూ జల్సాలకు దిగుతున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
35.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. కొన్ని చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాజన్నకు మొక్కులు



రాజన్నను దర్శించుకునేందుకు క్యూలైన్లో బారులుతీరిన భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు కొనసాగుతుండటంతో కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన భక్తులు.. ధర్మగుండంలో స్నానాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.

రేపు హుండీల ఆదాయం లెక్కింపు

రాజన్న హుండీల ఆదాయాన్ని ఈనెల 9న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో ఉదయం 8 గంటల నుంచి జరిగే లెక్కింపులో అధికారులు, సిబ్బంది హాజరుకావాలని సూచించారు.

ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించాలి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

కోనరావుపేట: ఐలమ్మ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మండలంలోని కనగర్తిలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. నిజాంలకు ఎదురునిలిచిన ఐలమ్మ ఈ తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రజకులకు నెలకు 250 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తోందన్నారు. గ్రామంలో రజక సంఘానికి రూ.3 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ కనగర్తి, మల్కాపేట గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సర్పంచ్ అనుపాటి భారతి, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, ఎంపీటీసీ లింగంపెల్లి లక్ష్మి, చాకలి ఐలమ్మ మనవడు రామచంద్రం, డెయిరీ అగ్రహారం మేనేజర్ రవీందర్, రజకసంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, మండల అధ్యక్షుడు చెక్కపెల్లి చంద్రయ్య, గ్రామాధ్యక్షుడు మారుపాక శంకర్, నాయకులు పాల్గొన్నారు.

మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గుంటి వేణు తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. ఆదివారం మండలంలోని కొదురుపాకలో విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఏళ్లు గడుస్తున్నా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఐక్యవేదిక, అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టే నిరసనకు సీపీఐ పక్షాన పూర్తి సంఘీభావం తెలిపారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మీసం లక్ష్మణ్, జూపల్లి శ్రీనివాస్, లక్ష్మణ్, రామచంద్రం, మల్లయ్య, రాములు ఉన్నారు.

నిర్వాసితుల సమస్యలు పట్టని ప్రభుత్వం



ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, ఈనెల 8నుంచి మూడు రోజులపాటు ముంపు గ్రామాల ఐక్యవేదిక, అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించే దీక్షకు మద్దతు ఇస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తెలిపారు. నిర్వాసితుల కుటుంబాలకు రూ.5.04లక్షల చొప్పున ఇస్తామని సీ ఎం కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. నిర్వాసితులకు దీక్షకు సిద్ధమవుతుంటే పోలీసులు 144 సెక్షన్ విధించడం ఏమిటని ప్రశ్నించారు. 144 సెక్షన్ రద్దు చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా

ప్రసాదాల గోదాం..!



నిర్లక్ష్యంగా కనిపిస్తున్న ఈ సిలిండర్లను ప్రసాదకూటుకు ఉపయోగిస్తారు. ఇక్కడి నుంచే పైపులైన్‌ల ద్వారా గ్యాస్ సరఫరా అవుతుంది. దీనికి సమీపం నుంచే భక్తులు వెళ్తుంటారు. ఏ చిన్న ప్రమాదం జరిగినా ఊహించని నష్టం జరిగే అవకాశం ఉంది.

- పెచ్చులూడుతున్న స్లాబ్
- పనులు ప్రారంభించని వీటీడీఏ
- ఇరుకు ఆవరణలోనే లడ్డూల తయారీ
- పట్టించుకోని అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది రాజన్న భక్తులకు లడ్డూప్రసాదం తయారీ చేసే గది. లడ్డూ తయారీకి ప్రధానమైన బూంది చేసేది ఇక్కడే. సిబ్బంది అత్యధిక ఉష్ణోగ్రత మధ్య పనిచేస్తుంటారు. మరోవైపు గది స్లాబ్ పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందోననే భయం సిబ్బందిని వెంటాడుతోంది. ఇటీవల ఓ కార్మికుడి తలపై పెచ్చులూడిపడడంతో ఆస్పత్రికి తరలించారు. అయినా మరమ్మతు మాత్రం చేపట్టడం లేదు.

వేములవాడ: వేములవాడ రాజన్నకు భక్తుల ద్వారా రూ.కోట్లు ఆదాయం వస్తున్నా.. వసతుల కల్పనలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడికొచ్చే భక్తులు లడ్డూప్రసాదాన్ని తప్పనిసరిగా తీసుకెళ్తారు. ఐదేళ్ల క్రితం భక్తుల రాక తక్కువగా ఉండడంతో 31 మంది సిబ్బందితో నిత్యం పదివేల లడ్డూలను తయారు చేసేవారు. క్రమంగా భక్తుల రాక పెరగడంతో ఇప్పుడు ముప్పై వేల లడ్డూలను తయారు చేస్తున్నారు. అయితే ఐదేళ్ల క్రితం ఉన్న 31 మంది సిబ్బందే మూడురెట్ల ఎక్కువ లడ్డూలను తయారుచేస్తున్నారు. భవనం పెచ్చులూడి ప్రమాదకరంగా మారినా మరమ్మతు చేయాలనే ఆలోచన ఎవరికీ రావడం లేదు. ప్రసాదం తయారు చేసే ప్రాంతంలో కనీస నిబంధనలు పాటించడం లేదు. ఇక్కడి సిబ్బంది నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనిచేస్తున్నారు. బాయిలర్ పైపులైన్ పాడైంది. రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ప్రసాదాల తయారీ కేంద్రాన్ని పరిశీలించి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. అయినా పనులు ముందుకుసాగడం లేదు.

పనులు ప్రారంభించని వీటీడీఏ

ముఖ్యమంత్రి కేసీఆర్ వేములవాడ రాజన్నను 2015 జూన్ 18న దర్శించుకున్నారు. ఆ సమయంలో గుడిని అభివృద్ధి చేస్తానని.. ఏటా రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తానని హామీ ఇచ్చారు. గుడి అభివృద్ధి పనులకు వీటీడీఏ (వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం చెప్పినట్లు వీటీడీఏ మాత్రమే ఏర్పాటైంది. పనులు మాత్రం చేపట్టడం లేదు. ప్రసాదాల తయారీ గోదాం ప్రమాదకరంగా ఉన్నప్పటికీ శాశ్వతభవనం పనులు చేపట్టడం లేదు. పెచ్చులూడుతున్నప్పటికీ అక్కడి సిబ్బంది భయం భయంగానే పనిచేస్తున్నారు. అంతేకాకుండా ఏమైనా ప్రమాదం జరిగితే వెంటనే అక్కడి నుంచి తప్పించుకునేందుకు అత్యవసర ద్వారం కూడా లేదు. వాటర్ బాయిలర్ పైపులైన్ సైతం ప్రమాదకరంగా ఉంది. ప్రసాదాల తయారీ భవనంలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రస్తుతం ప్రసాదాలు తయారీ చేసే భవనం అనువుగా లేదు. ప్రసాదాలు తయారు చేసే ప్రాంతంలో నిబంధనలు పకడ్బందీగా పాటించాలి. వేడి, భవనం ఎత్తును పరిగణనలోకి తీసుకొని నిర్మించాల్సి ఉంటుంది. గతంలో ప్రమాదాలు సైతం జరిగాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. టెంపరరీగా భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తాం.

– రాజేశ్, ఆలయ ఈఈ

తడగొండలో కొవ్వొత్తుల ర్యాలీ



తడగొండలో కొవ్వొత్తుల ర్యాలీ

బోయినపల్లి(చొప్పదండి): మల్కాపూర్ గ్రామానికి చెందిన జవాన్ పబ్బాల అనిల్ మృతికి సంతాపంగా ఆదివారం రాత్రి మండలంలోని తడగొండలో గ్రామస్తులు, యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సర్పంచు చిందం రమేశ్, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, చేపూరి కనుకయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీధర్‌స్వామిజీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. భక్తులు స్వామివారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచ్‌లు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చేపూరి రాజేశం, సభ్యులు రమణయ్య, బాల్‌రాజు, బండ సతీష్, అల్లాడి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అనిల్ కుటుంబానికి బండారు దత్తాత్రేయ పరామర్శ

బోయినపల్లి: జమ్మూకాశ్మీర్‌లో హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయిన మల్కాపూర్ గ్రామానికి చెందిన జవాన్ పబ్బాల అనిల్ కుటుంబానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం తెలిపారు. ఆదివారం అనిల్ సోదరుడు శ్రీనివాస్‌తో మాట్లాడారు. అనిల్ భార్య సౌజన్యను పరామర్శించారు. ప్రమాదంలో యువ జవాన్‌ను కోల్పోవడం బాధాకరమన్నారు.

నేడు సర్పంచ్‌ల 'చలో కలెక్టరేట్'

వేములవాడరూరల్: సర్పంచ్‌ల పదవీకాలం దగ్గర పడుతున్నప్పటికీ చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లే ఉండడంతో ఎవరికి చెప్పుకోలేక.. బయటపడలేక ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో చాలా వరకు సర్పంచ్‌లు పనులు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదు. ఈ విషయంపై చాలాసార్లు మండల, జిల్లా సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పెద్దగా స్పందన లేకుండాపోయింది. ఈ క్రమంలో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా సర్పంచ్‌లు ఇటీవల చర్చించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు సోమవారం జిల్లాలోని సర్పంచ్‌లందరూ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పదవీకాలం దగ్గర పడుతున్నా ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు రాక అప్పులపాలవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో ఆరు నెలల్లో పదవీకాలం ముగియనుందని, డిజిటల్ కీ రావడంతో ఏ నిధులు వస్తున్నాయో..? ఎక్కడికి పోతున్నాయో..? కూడా తెలియడం లేదని సర్పంచ్‌లు బహిరంగంగానే చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సర్పంచ్‌లకు నేరుగా నిధులు మంజూరు చేస్తామని ప్రకటించింది. అయితే బ్యాంకులో అకౌంట్ తీసినప్పటికీ ఏ నిధులూ రావడం లేదని అంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధులు రాక చేసిన పనులకు పెట్టుబడులు పెట్టి సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు ఇప్పించాలని కలెక్టర్‌కు స్వయంగా విన్నవించేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

పోలీసుల నిఘాలో ముంపు గ్రామాలు

వేములవాడఅర్బన్/బోయినపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో మధ్యమానేరు నిర్వాసితులు నిరాహారదీక్షకు దిగుతామని ప్రకటించడంతో పోలీసులు నిఘా సారించారు. ఈనెల 8 నుంచి మూడురోజులపాటు సంకెపల్లి, రుద్రవరం మధ్య దీక్షకు దిగుతామని, నిర్వాసితులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఇటీవల అఖిలపక్షం నాయకులు ప్రకటించారు. ఈ నిరాహారదీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. పైగా ఆదివారం నుంచి ఈనెల 12 వరకు నిర్వాసిత గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రకటించారు. ఉదయం నుంచే ముంపు గ్రామాలపై నిఘా పెట్టారు. ఎక్కడ సభలు, సమావేశాలు నిర్వహించినా... జనాలు గుంపులుగా ఉన్నా.. ధర్నాలు, రాస్తారోకోలు చేసినా.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్నిగ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా అఖిలపక్షం నాయకుడు ఎర్రం మహేశ్‌ను ఆదివారం రాత్రి ఆయన ఇంట్లోనే నిర్బంధించారు. మరోవైపు కొదురుపాక వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేబ్రిడ్జిల మాయాజాలం

- ఒక్కో కాంటాది ఒక్కో తీరు
- తూకంలో క్వింటాళ్లలో తేడా
- కళ్లెదుటే దర్జాగా దోపిడీ



సాయి వేబ్రిడ్జిలో 34,880 కిలోలు చూపుతున్న తూకం



స్వాతి వేబ్రిడ్జిలో 35115 కిలోలుగా..

సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెలో రైతులు పండించిన ధాన్యాన్ని ఐకేపీ అధికారులు, సిబ్బంది తూకం వేయించి లారీలో లోడ్ చేసి మిల్లుకు పంపించారు. తంగళ్లపల్లిలోని స్వాతి వేబ్రిడ్జి వద్ద తూకం వేయించగా.. 35,115 కిలోలు (351 క్వింటాళ్లు)గా వచ్చింది. తూకం వేసిన అనంతరం లారీని సాధారణంగా అయితే రైస్‌మిల్లుకు తరలించాలి. కానీ.. రైస్‌మిల్లు యజమానులు అదే లారీని అదే రోజు శ్రీసాయి వేబ్రిడ్జిలో తూకం వేయించారు. అక్కడ 34,880 కిలోలు (348.80 క్వింటాళ్లు)గా వచ్చింది. అంటే 235 కిలోలు తక్కువగా వచ్చింది. ఒకే లారీ.. ఒకేరోజు వేరువేరు వేబ్రిడ్జిలపై తూకం వేస్తే 2.35 క్వింటాళ్ల తేడా చూపింది. దీంతో రైస్ మిల్లు యజమాని తక్కువ తూకం వచ్చిన రశీదు ఆధారంగానే ఆ లారీలోని ధాన్యాన్ని దిగుమతి చేసుకున్నాడు.

అంతా మోసం.. రైతులకు శాపం..

యాసంగి సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు, నీటి కొరత, కరెంట్ సమస్య అధిగమించి ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటను తూకం వేసే దశలో వేబ్రిడ్జిల నిర్వాహకులు ఇలా బహిరంగంగా మోసం చేసి తప్పుడు తూకం నివేదికలు ఇస్తున్నారు. తక్కువ తూకం వచ్చిన రశీదు ఆధారంగానే రైతులకు ధాన్యం డబ్బులు చెల్లింపులు జరుగుతాయి. ఈ లెక్కన ఆ రోజు సదరు లారీకి ధాన్యం అందించిన రైతులందరూ తూకంలో తక్కువ వచ్చిన ధాన్యం తాలూకు నష్టాన్ని భరించాల్సిందే అన్నమాట. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ సంచి బరువుతోపాటు, తరుగు పేరిట రెండు, మూడు కిలోలు ఎక్కువ తూకం వేస్తుండగా.. చివరికి ఇలా వేబ్రిడ్జిల్లోనూ తూకంలో మోసం చేయడం దారుణం. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 27,456 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇలా కళ్లెదుటే తూకంలో మోసాలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేక దిగాలుగా చూడడం తప్ప రైతులు ఏమీ చేయలేకపోతున్నారు.

పట్టింపులేని తూనికలు.. కొలతల శాఖ..

జిల్లాలో తూనికలు, కొలతల శాఖ అధికారులు వేబ్రిడ్జిలను పట్టించుకోవడం లేదు. ఫలితంగా వాటి నిర్వాహకులు మిల్లుల యజమానులకు లోపాయికారీగా వ్యవహరిస్తూ.. తప్పుడు తూకాలతో మోసం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు లేక, వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నట్లు తీవ్రమైన విమర్శలున్నాయి. కూరగాయల మార్కెట్, చేపల, మటన్ మార్కెట్‌లోనూ తూనికల రాళ్లు సరిగా లేక, తక్కువ తూకంతో ప్రజలను మోసం చేస్తున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేసి మోసాలు చేసే వారిపై కేసులు నమోదు చేస్తే.. కొంత మేరకైనా బహిరంగ దోపిడీని అరికట్టినట్లు అవుతుంది.

మిల్లుల్లోనే తూకం వేయాలి..



ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రైస్ మిల్లుల్లోనే తూకం వేయాలి. ఏమైనా తేడా వస్తే ఫిర్యాదు చేయాలి. ప్రైవేటు వేబ్రిడ్జిల్లో తూకం వేస్తే కొంత మేరకు తేడా వస్తుంది. తంగళ్లపల్లిలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. మిల్లర్లతో మాట్లాడి ఎలాంటి కటింగ్ చేయొద్దని చెప్పాం. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం జరగనివ్వం.

– ఎస్.జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో

తూకంలో తేడా రావద్దు..

వే బ్రిడ్జిల్లో తూకంలో తేడా రావద్దు. ఈ వ్యాల్యూలో పది కిలోల ప్లస్, పది కిలోల మైనస్‌ను మినహాయింపు ఉంటుంది. కానీ క్వింటాళ్లలో తేడా వస్తే తప్పు జరిగినట్లే. తప్పకుండా తనిఖీలు నిర్వహించి తప్పు చేసిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం.

– రూపేశ్‌కుమార్, తూనికలు, కొలతలశాఖ అధికారి

మానేరు తీరంలో నవ్వులు జల్లులు..



మానేరులో సందడి చేస్తున్న యోగా సాధకులు

సిరిసిల్లకల్చరల్: మానేరు తీరం నవ్వులమయం అయ్యింది. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఆదియోగి యోగా సాధనాలయం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించింది. బతుకమ్మ ఘాట్ సమీపంలోని మానేరు నదిలో సుమారు 70 మంది యోగా సాధకులు వివిధ రకాల విన్యాసాలతో సందడి చేశారు. ఉరుకులు, పరుగుల జీవితంలోపడి మనిషి నవ్వడమే మరిచిపోవడం బాధాకరమని యోగా శిక్షకుడు ఉప్పల శ్రీనివాస్ అన్నారు. నవ్వుతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు.

చే'నేత'ల కీర్తి..అందరికీ స్ఫూర్తి..



లక్ష్మణ్, హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న సభ్యులు

- చేనేత శిల్పి హరిప్రసాద్, కవి లక్ష్మణ్‌కు సన్మానం

సిరిసిల్లటౌన్: వివిధ రంగాల్లో రాణిస్తున్న చే'నేతన్నల'కీర్తి అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. చేనేత శిల్పిగా వెల్ది హరిప్రసాద్, కవిగా ఆడెపు లక్ష్మణ్ రాణిస్తున్నందుకు హర్షిస్తూ ఆదివారం స్థానిక నెహ్రూనగర్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అరుదైన చేనేత ఉత్పత్తులు చేపడుతూ ప్రపంచ ఖ్యాతి ఆర్జిస్తున్న హరిప్రసాద్‌ను ఇటీవల ప్రధాని మోదీ అభినందించారని, లక్ష్మణ్ వెలువరించిన కవితా సంకలనాలు ఐటీ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నాయని ప్రశంసించారు. యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు గుండ్లపెల్లి గౌతం, మాచర్ల శ్రీకాంత్, సూర్య, విజయ్, రాజు, శ్రావణ్, శ్రీకాంత్, విజయ్, శ్రీనివాస్, చంద్రకాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి అందాల మధ్య పరమశివుడు

వేములవాడ: రాజన్న గుడి.. ఆ పక్కనే గుడి చెరువు.. అందమైన పట్టణం.. ఇలా ప్రకృతి అందాల మధ్య పరమశివుడు కొలువుదీరిన సుందర దృశ్యం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రాష్ట్రంలోనే ఆదాయంలో మొదటి స్థానంలో నిలిచిన రాజన్నను నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుని తరిస్తుంటారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయిస్తే ఈ సుందర దృశ్యం మరింత ఆకర్షణగా నిలవనుందని స్థానికులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

వంశీకృష్ణకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వంశీకృష్ణ

గొల్లపల్లి : మండల కేంద్రానికి చెందిన తాడూరి వంశీకృష్ణ శనివారం కోయం బత్తూర్‌లో జరిగిన శతాబ్ధి ఉత్సవాల్లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వంశీకృష్ణ సామాజిక అంశాలపై సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థి, యువతకు వ్యక్తిత్వ వికాస శిక్షణ నిర్వహిస్తున్నారు. పదమూడేళ్లుగా వంశీకృష్ణ అందిస్తున్న సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



భవనానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వడ్డీలేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్‌లో సీడీపీ నిధులు రూ.8లక్షలతో నిర్మిచనున్న మహిళా సంఘం భవనానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రుణాలు అందించడంతోపాటు వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో మహిళలకు సంఘ భవనాలను మంత్రి కేటీఆర్ సహకారంతో ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో ఆదివారం విద్యుదాఘాతంతో నెమలి మృతిచెందింది. ఆలయ ప్రహరీని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు తగిలి నెమలి మృతిచెందినట్లు ఆలయ కమిటీ సభ్యులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

ఇద్దరిపై కేసు

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద ఈనెల 5న ఆర్టీసీ బస్సు అద్దాలు పగులగొట్టిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్ రావు తెలిపారు. హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్‌కు వెళ్తుండగా జగిత్యాల మంచినీళ్ల బావి వద్ద ఇద్దరు యువకులు బస్సును అడ్డగించారు. బండరాయి విసరడంతో బస్సు అద్దాలు పగిలి ప్రయాణికుడికి తీవ్రగాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ మామిడి కొండాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడిపై..

మెట్‌పల్లి : పట్టణానికి చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... సదరు బాలిక శనివారం ఉదయం కిడ్నాప్‌కు గురైందని ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ చేసిన వంశీ అనే యువకుడిపై పోక్సోకింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భార్యపై దాడి..కేసు నమోదు

సారంగాపూర్ : మండలంలోని కోనాపూర్ గ్రామంలో భార్యపై భర్త దాడిచేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. భర్త సలీం, భార్య హసీనాబేగం మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన సలీం కర్రతో భార్యపై దాడిచేశాడు. ఈ ఘటనలో హసీనాబేగం తలకు తీవ్రగాయాలయ్యాయి. హసీనాబేగం ఫిర్యాదు మేరకు సలీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతోవ్యక్తి మృతి



నారాయణ (ఫైల్)

సిరిసిల్ల అర్బన్ : గుండెపోటుతో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి మండలం.. మర్లపేటకు చెందిన ఆసరి నారాయణ (58) చిరు వ్యాపారం చేసుకుంటూ సిరిసిల్ల పట్టణంలోని రెడ్డివాడలో ఉంటున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం భార్య మృతిచెందగా ఇద్దరు కుమారులు మోజేశ్, ప్రవీణ్‌ను చదివిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి గుండెనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలినట్లు స్థానికులు తెలిపారు. నారాయణ మృతితో ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇక రెండో విడత గొర్రెలు..!

- పంపిణీకి రంగం సిద్ధం
- జిల్లాలో 4,620 మంది లబ్ధిదారులు
- పెరిగిన రూ.12,500 లబ్ధిదారుడి వాటా
- కొనసాగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియ



మొదటి విడతలో అందజేసిన గొర్రెలు (ఫైల్)

చందుర్తి (వేములవాడ) : రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారులు పంపిణీకి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ మేరకు లబ్ధిదారులు చేసుకున్న అర్జీలను రీవెరిఫికేషన్ చేసే పనుల్లో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు.

2017లో పథకం ప్రారంభం

గొర్రెల పెంపకందారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 2017 జూన్ 20న ఈ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా గ్రామాలవారీగా సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. డిప్ ద్వారా మొదటి, రెండో విడతల లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారులకు 2017–18 ఆర్థిక సంవత్సరంలోనే యూనిట్లు అందజేశారు. ఈ యూనిట్‌లో ఒక పొట్టేలు, 20 గొర్రెలు ఉండేలా పథకాన్ని రూపొందించారు.

జిల్లా వ్యాప్తంగా 16,162 మంది లబ్ధిదారులు

గొల్ల, కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా 16,162 మంది లబ్ధిదారులను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. మొదటి విడతలో 8,137 లబ్ధిదారులకు అందించేందుకు లక్ష్యం పెట్టుకోగా వారిలో 7,517 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందజేశారు. రెండో విడతలో 8,025 మందికి అందించేందుకు అధికారుల లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో గతేడాది 4,025 మంది లబ్ధిదారులకు యూనిట్లు అందించారు. మొదటి, రెండో విడతల్లో పంపిణీ చేయని 4,620 మంది లబ్ధిదారులకు గొర్రెలు అందించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

పెరిగిన వాటాధనం చెల్లింపు..

గొర్రెల పథకంలో యూనిట్ ధర పెరగడంతో లబ్ధిదారుడి వాటాధనం చెల్లింపును పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో లబ్ధిదారుడికి అదనంగా రూ.12,500 భారం పడుతోందని వాపోతున్నారు. మొదటి విడత యూనిట్ ధర రూ.1.25లక్షలు కాగా లబ్ధిదారుడు తన వాటాధనంగా 25 శాతం సొమ్ము కింద రూ.31,250 చెల్లించారు. ఇప్పుడు యూనిట్ ధర రూ.1.75 లక్షలు పెరగగా వాటాధనం రూ.43,750 చెల్లించాల్సి వస్తోంది.

కొనసాగుతున్న రీవెరిఫికేషన్ ప్రక్రియ

జిలాల్లో మిగిలిన లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు అందించేందుకు రీవెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి కావస్తోంది. పశు వైద్యాధికారితో పాటు గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సొసైటీ ఇన్‌చార్జి, ఆశాఖ ఏడీలు కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పూర్తిచేశారు. లబ్ధిదారులు వాటాధనం చెల్లించేందుకు కలెక్టర్ పేరిట బ్యాంకులో అకౌంట్లు తీశారు. వాటాధనాన్ని చెల్లించడంతో కలెక్టర్ లాగిన్‌లో కనిపిస్తుంది. చెల్లించిన వాటాధనం రశీదుతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, కుల ధ్రువీకరణ పత్రాన్ని కలెక్టరేట్‌లో అందించాలి.

న్యాయం చేయాలి



ఉపాధికోసం గొర్రెల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్నా. మొదటి విడతలో రాకుంటే, రెండో విడతలో వస్తుందని అనుకున్నా. ఇప్పుడు కూడా పేరు రాలేదు. ఇదేంటని సార్లను అడిగితే దరఖాస్తు మాకు అందలేదని అంటున్నారు. కలెక్టర్ సారైనా నాకు న్యాయం చేయాలి.

– మ్యాకల బాబు, యువకుడు, బండపల్లి

లబ్ధిదారులందరికీ యూనిట్లు అందజేస్తాం



జిల్లాలో మిగిలిన లబ్ధిదారులందరికీ యూనిట్లు అందజేసేందుకు వెరిఫికేషన్ పూర్తిచేశాం. లబ్ధిదారులు తమ వాటాధనాన్ని చెల్లిస్తే తొందర్లోనే గొర్రెల యూనిట్లను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో 4,620 మంది లబ్ధిదారులుండగా ఇప్పటివరకు 927 మంది లబ్ధిదారులు మాత్రమే వాటా ధనం చెల్లించారు. మిగితావారు చెల్లిస్తే వెంటనే గొర్రెల యూనిట్లు అందిస్తాం.

– కొమురయ్య, జిల్లా పశువైద్యాధికారి

వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొన్న కార్లు





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

- ఒకరి దుర్మరణం.. నలుగురికి తీవ్ర గాయాలు
- కురిక్యాల శివారులో ఘటన



అజయ్ (ఫైల్)

గంగాధర(చొప్పదండి)/వేములవాడ: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అభిలాష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లికి చెందిన సోమినేని భూమయ్య–భారతి దంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించారు. పెద్ద కుమారుడు అజయ్(40) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య సాయిరక్షిత, ఎనిమిదేళ్ల కూతురు, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం తన కుటుంబసభ్యులతో కలిసి గంగాధరలో జరిగిన వివాహానికి హాజరయ్యాడు. అనంతరం కరీంనగర్‌కు వెళ్లి వస్తానని, ఇక్కడే ఉండాలని కుటుంబీకులను చెప్పి, కారులో బయలుదేరాడు. అదే సమయంలో వైరాగి అభిషేక్, తన ముగ్గురు కుటుంబసభ్యులతో కలిసి కొమురవెల్లి నుంచి కొండగట్టుకు కారులో వెళ్తున్నాడు. గంగాధర మండలంలోని కురిక్యాల శివారు కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రెండు వాహనాలు వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మ రో కారులో ఉన్న అభిషేక్, ఇద్దరు మహిళలు, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై అభిలాష్ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించి, కేసు న మోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు, గురువులు.

చందుర్తి (వేములవాడ) : రుద్రంగి మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరుకొని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వీరయ్య, లింగారెడ్డి, రవీందర్, పుష్పలత, అనురాధ, శేఖర్, సత్యనారాయణ, విజయలక్ష్మి, శివప్రసాద్, నరేందర్, అజయ్, రఘుపతిరావు, కిషన్, విద్యార్థులు మల్లేశం, మహేశ్, రాజు, కిషోర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగులకు అంతర్గత బదిలీలు

సాక్షి ఎఫెక్ట్

వేములవాడ : రాజన్న ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అంతర్గత బదిలీలను ఎట్టకేలకు ఆలయ ఈవో నిర్వహించారు. కిందిస్థాయి ఉద్యోగులను మాత్రమే బదిలీచేసి పైస్థాయి అధికారులతోపాటు పలు కేసుల్లో చిక్కి విచారణ కొనసాగుతున్న ఉద్యోగులను వదిలేసి బదిలీలు చేపట్టడంతో పలువురు ఉద్యోగులు బాహాటంగా చర్చించుకోవడంపై ×పంపకాల కోసమేనా? అనే శీర్షికన ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆలయ ఈవో 16 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మొదటి సారి నిర్వహించిన బదిలీల్లో 13 మంది, సాక్షి కథనం అనంతరం 16 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అవడంపై చర్చనీయాంశమైంది. అయినా సగం మంది ఉద్యోగులు తమకు బదిలీ అయిన స్థానాల్లో చేరలేదు. ఈ విషయమై ఆలయ ఈవో, ఏఈవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించలేదు.

విధుల్లో చేరిన సగమంది ఉద్యోగులు..

ఆలయ ఈవో తాజాగా వెలువరించిన 16 మంది ఉద్యోగుల అంతర్గత బదిలీల్లో కేవలం సగం మంది ఉద్యోగులు విధుల్లో చేరారు. తమ స్థానాలను వదులుకునేందుకు ఇష్టంలేని ఉద్యోగులు పెద్దఎత్తున పైరవీలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆలయంలో అంతర్గత ఉద్యోగుల బదిలీల కోసం పెద్ద ఎత్తున చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

ఒకేరోజు ఇద్దరు యువకుల మృతి

- గుండెపోటుతో ఒకరు, విద్యుత్‌షాక్‌తో మరొకరు
- జిల్లెల్లలో విషాదం..



ప్రభాకర్ (ఫైల్)



రాజశేఖర్ రెడ్డి (ఫైల్)

తంగళ్లపల్లి, గంభీరావుపేట (సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఒకేరోజు ఇద్దరు యువకులు మృతిచెందడడంతో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన మల్లమారి ప్రభాకర్ (34) గ్రామపంచాయతీ కారోబార్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ప్రభాకర్‌కు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు జయంత్, అనీష్ ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో మరొకరు..

జిల్లెల్లకు చెందిన అన్నం రాజశేఖర్ రెడ్డి (27) గంభీరావుపేట మండలానికి హార్వెస్టర్ తీసుకెళ్లి డ్రైవర్‌తో వరి కోస్తుండగా విద్యుత్ వైర్లు హార్వెస్టర్‌కు తగిలాయి. ఈ ఘటనలో రాజశేఖర్ రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ సింగ్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి భాగ్య, తండ్రి రాజిరెడ్డి ఉన్నారు. ఒకేరోజు ఇద్దరు యువకులు హఠాన్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పేకాటలో 'పెద్దోళ్లు'..

- పట్టణ నడిబొడ్డున మూడు ముక్కలాట
- అడ్డగా మారిన సిరిసిల్ల టౌన్ క్లబ్



పేకాడిన సిరిసిల్ల టౌన్ క్లబ్ ఇదే

సిరిసిల్లక్రైం: ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు దారి తప్పుతున్నారు. వారికి వ్యాపారులూ జతకలుస్తున్నారు. పేకాట, పార్టీలు అంటూ జల్సాలకు దిగుతున్నారు. ఇలాంటి వారిని కట్టడి చేయాల్సిన పోలీసులు ఈ ×పెద్దల?పై మాత్రం చర్యలకు వెనుకడుగు వేస్తున్నారు. చట్టవిరుద్ధమైన విధానాలను అరికట్టేందుకు జిల్లా అధికారులు సాహసం చేయలేరని తెలిసిన పలువురు రాష్ట్రస్థాయిలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో హడావుడిగా తనిఖీలు చేసి మూడుముక్కలాడుతున్న ముఖ్యనేతలు, వ్యాపారులను పట్టుకున్నారు. ఇందులోభాగంగా భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఖాకీలపై సామాజిక మాధ్యమాల్లో పొగడ్తల వర్షం కురిపించారు. అయితే కేవలం కొద్ది గంటలు మాత్రమే. పోలీస్‌స్టేషన్‌కు చుట్టపుచూపుగా వెళ్లి వచ్చామని పట్టుబడిన వారందరూ ముచ్చటించుకోవడంతో ఖాకీలపై ఖద్దర్ చొక్కాల బలం బలంగా పని చేసిందని వ్యంగ్యాస్త్రాలు చర్చకు దారితీశాయి.

కాలక్షేపమా..? కాసుల వేటనా..?

జిల్లా కేంద్ర నడిబొడ్డున ఉన్న సిరిసిల్ల టౌన్ క్లబ్‌కు ఓ చరిత్ర ఉంది. లక్షలు వెచ్చించిన దీనిలో సభ్యత్వం ఇవ్వబోరని, కఠినమైన నిబంధనలు అమలు చేస్తారని విశ్వసనీయ సమాచారం. సభ్యత్వం ఉన్న వారందరూ కాలక్షేపానికి పలు సందర్భాల్లో సహాయ సహకరాలు, క్రీడలు ఆడేందుకు అవకాశం ఉంది. ఇందులో క్రీడాస్థలంలో జిల్లాలో అధికారులు షటిల్, పలు సందర్భాల్లో స్థలాన్ని వివిధ కార్యక్రమాలకు ఉపయోగిస్తుంటారు. ఇక అధికారులే మన స్థలంలో ఉన్నారనుకున్నారో ఏమోగానీ కొందరు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు ఏకంగా మూడు ముక్కలాటకు క్లబ్‌ను వేదిక చేశారు. ఇక్కడివారే కాదు పొరుగున ఉన్న సిద్దిపేట నుంచి కూడా ఆడేందుకు వచ్చారంటే పేకాట ఏస్థాయిలో నడస్తుందో అర్థం చేసుకోవచ్చు. క్లబ్ పరిసరాల్లో ఉన్న షటిల్ కోర్టులో అధికారులు ఆడుతుంటే తమను పట్టుకునే వారెవరు అనుకునే సమయంలోనే పోలీసులు తనిఖీల చేయడం.. నగదు పట్టుబడడం టౌన్ క్లబ్ విధానాలు బహిర్గతమయ్యాయి. క్లబ్‌లో కాలక్షేపం కోసం కాకుండా కాసులతోనే ఆడుతున్నారని అందరికీ అర్థమైంది.

ఉన్నతాధికారులు ఆదేశాలతోనే..

జిల్లాలో అడపాదడపా పేకారాయుళ్లను పట్టుకోవడం.. కేసులు నమోదు సాధారణమే. రెవెన్యూ, అటవీశాఖ, పక్కనే టౌన్ పోలీస్‌స్టేషన్, ఆ పక్కనే ఎస్పీ నివాసం, సమీపంలోనే జిల్లా పోలీస్ కార్యాలయాలు ఉన్నాయి. ఎటుచూసినా కూతవేటు దూరంలో ఉన్న సిరిసిల్ల టౌన్ క్లబ్‌లో పేకాట ఏళ్లతరబడి సాగుతున్నా పట్టుకున్న పోలీసులు లేరన్న అపవాదులున్నాయి. శనివారంనాటి దాడికూడా జిల్లా పోలీసులు పైఅధికారుల ఆదేశాలతో చేశారేగానీ వారికివారు చేసింది కాదని జిల్లాలో చర్చ జరుగుతోంది. సిద్దిపేటకు చెందిన కొందరు పేకాటరాయుళ్ల క్లబ్‌లో ఎప్పటిలాగే మూడుముక్కలాట కోసం రాగా.. వారు ఆడేందుకు క్లబ్ సభ్యుల్లో కొందరు వ్యతిరేకించారని, భంగపడినవారే రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారని సమాచారం. పైనుంచి ఆదేశాలు రాగానే ఇక తప్పదన్నట్లు క్లబ్‌పై ఆకస్మిక దాడి చేశారు. పట్టుబడిన ప్రజాప్రతినిధులు, వ్యాపారుల నుంచి రూ.1,34,490 సీజ్ చేశారు. అయితే అది పేకాడుతుండగా పట్టుబడింది కాదని, వ్యాపారాలు ముగించుకుని నేరుగా క్లబ్‌కు వచ్చిన వారిదేనని పట్టుబడిన వారు చెప్పినట్లు తెలుస్తోంది.

కోనేరుకు పూర్వ వైభవం



విద్యుత్ వెలుగుల్లో కోనేరు

కోరుట్లటౌన్ : పట్టణంలోని పురాతన కోనేరుకు పూర్వవైభవం రానుంది. కోనేరును పునరుద్ధరించాలని మున్సిపల్ శాఖ సెక్రటరీ అరవింద్ కుమార్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతం గడి బురుజుల సమీపంలోని పురాతన కోనేరులో మున్సిపల్ ఆధ్వర్యంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించి శుభ్రంచేశారు. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ మకరంద్, కోరుట్ల ఆర్డీవో వినోద్‌కుమార్, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సాగర్, మున్సిపల్ చైర్పర్సన్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, తహసీల్దార్ రాజేశ్ సందర్శించి కోనేరును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు. ఈ నేపథ్యంలో కోనేరు విశిష్టతను తెలుపుతూ సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయింది. మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ ట్విట్టర్ వేదికగా కోనేరుకు సంబంధించిన వీడియోను పోస్ట్‌చేశారు. కోనేరు పునరుద్ధరణలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ భాగస్వాములు అయ్యారని తెలిపారు.

యువతి పరారీ.. నిలిచిన వివాహం

జగిత్యాల క్రైం : తెల్లారేసరికి పెళ్లి.. రెండు కుటుంబాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. అంతలోనే యువతి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. చివరికి అక్క భర్తతోనే వెళ్లిపోయినట్లు తెలియడంతో వారంతా ఖంగుతిన్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి (20)కి మరో గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిపేందుకు నిశ్చయించారు. ఆదివారం ఉదయం వధువు ఇంటి వద్ద వివాహం జరగాల్సి ఉండగా అంతా సిద్ధంచేశారు. వేకువజామున వెళ్లి చూసేసరికి వధువు కనిపించలేదు. చివరికి పొరుగు జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన అక్క భర్తనే వివాహానికి వచ్చి, వధువును తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు నిర్ధారించారు. దీంతో వివాహం నిలిచిపోవడంతో రెండు కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. చెల్లె వివాహానికి వస్తే తన భర్తే ప్రేమ పేరుతో ఆమెను తీసుకెళ్లడంతో యువతి అక్క ఆందోళనకు గురైంది.

జీపు, ద్విచక్రవాహనం ఢీ..

సారంగాపూర్ : బీర్‌పూర్ మండలం.. కమ్మునూర్ గ్రామ వంతెన వద్ద ద్విచక్ర వాహనాన్ని జీపు ఢీకొంది. ఎస్సై అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలం కండ్లపల్లికి చెందిన నారపాక కమలాకర్ ద్విచక్రవాహనం, మంచిర్యాల జిల్లా జన్నారంకు చెందిన ఇలియాస్, మహ్మద్ జీపు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కిందపడిన కమలాకర్ జీపులో ఉన్నవారిపై ఆగ్రహం వ్యక్తంచేశాడు. దీంతో ఇలియాస్ కత్తితో కమలాకర్‌పై దాడికి యత్నించాడు. అప్రమత్తమైన కమలాకర్ అదే కత్తితో ఇలియాస్‌పై దాడిచేయగా ఇద్దరికి గాయాలయ్యాయని తెలిపారు. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, విచారణ చేపడుతున్నామని ఎస్సై వివరించారు.

ఇల్లంతకుంటలో ఈదురుగాలుల వర్షం



గాలిపెల్లిలో వరిపైరులో నిలిచిన నీరు

ఇల్లంతకుంట : మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలిపెల్లి, పొత్తూరు, జవారిపేట, నర్సక్కపేట, రహీంఖాన్‌పేటతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురవగా గాలిపల్లిలో వరిపైరు నేలవాలింది. వరిపొలాల్లో వర్షపు నీరు నిలవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాళ్లపల్లి గ్రామం మల్లన్నగుడిలోని ధ్వజస్తంభం పాక్షికంగా ధ్వంసమైంది. అనంతారంలోని ఎస్సీ కాలనీలో కొబ్బరిచెట్టుపై పిడుగుపడటంతో మంటలు చెలరేగాయి.